

## 13 నుంచి 16వ తేదీ వరకూ ప్రత్యేక రైళ్లు



**ప్రజాశక్తి - నరసాపురం**

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకూ నరసాపురం - నాగర్‌సోల్, నరసాపురం - సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు స్టేషన్ మేనేజర్ మధుబాబు తెలిపారు. 07698 నంబర్ రైలు నరసాపురంలో ఈ నెల 13న ఉదయం 9.50 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9 గంటలకు నాగర్‌సోల్ చేరుతుంది. 07517 నంబర్ రైలు 15న రాత్రి 8 గంటలకు నరసాపురం నుంచి బయలుదేరి సికింద్రాబాద్ చేరుకుంటుంది. అక్కడి నుంచి 07518 నంబర్ రైలు 16న సాయంత్రం బయలుదేరుతుంది.

# భూయజమానులకే బీమా..!

**ప్రభుత్వ నిర్ణయంతో కౌలురైతులకు అన్యాయం**

**ఇ-పంటలో భూయజమానుల పేర్లే నమోదు**

**కౌలురైతుల పేర్ల నమోదుకు యాజమానుల నుంచి వ్యతిరేకత**

**ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులిస్తేనే కౌలురైతులకు బీమా ఫలాలు**

**వరదలు, భారీ వర్షాల ఇప్పటికే నష్టాలు**


**ప్రభుత్వ తీరుపై కౌలురైతుల్లో తీవ్ర ఆవేదన**

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

పంటల బీమాపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కౌలురైతులకు తీవ్ర అన్యాయం జరగనుంది. గత ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని సరిచేయడం వదిలేసి మళ్లీ అదేవిధంగా బీమా పాలసీ కొనసాగించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత ఖరీఫ్‌కు గత ప్రభుత్వం అమలు చేసిన బీమా విధానాన్నే అమలు చేయడం రైతాంగంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఖరీఫ్, రబీల్లో దాదాపు ఏడు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. వరదలు, భారీ వర్షాలకు ప్రతియేటా పెద్దఎత్తున పంటలను జిల్లా రైతాంగం నష్టపోతుంది. రెండుజిల్లాల్లో మూడు లక్షల మంది కౌలురైతులు ఉండగా జిల్లా వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా వారే సాగు చేస్తున్నారు. పంట నష్టపోయిన కౌలురైతులకు మాత్రం బీమా పరిహారం అందడం లేదు. గత పాలకులు పంటల బీమాపై అనుసరించిన విధానాలే అందుకు ప్రధాన కారణం. ఇ-పంటలో నమోదైన రైతులకే పంటల బీమా వర్తించేవిధంగా గత ప్రభుత్వం ముందుకు సాగింది. కౌలుచట్టంలో మార్పులు చేసి కౌలురైతులకు కౌలుకార్డులు అందకుండా చేసింది. చట్టంలో భూయజమాని అంగీకారంతోనే కౌలుకార్డులు జారీ చేయాలనే నిబంధన కౌలురైతులకు ఉరితాడుగా మారింది. ఇ-పంటలో భూయజమానుల పేర్లు తప్ప కౌలురైతుల పేర్లు ఎక్కడా నమోదు కావడం లేదు. ఒకవేళ క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు నమోదు చేయాలని ప్రయత్నిస్తే భూయజమానుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. దీంతో అధికారులు సైతం ఇ-పంటలో భూయజమానుల పేర్లే నమోదు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం సాగు చేస్తున్న రైతుల పేర్లు ఇ-పంటలో నమోదు చేయాలి. అప్పుడే కౌలురైతుల పేర్లు నమోదై ప్రభుత్వం అందించే పంట నష్టపరిహారం, బీమా వంటి సాయం అందుతుంది. అది జరగడం లేదు. దీంతో ఆగ్రహం చెందిన కౌలురైతులు గత ఎన్నికల్లో టిడిపి కూటమికి గంపగుత్తగా ఓట్లు వేశారు. కూటమి ప్రభుత్వం కొత్త బీమా పాలసీ తీసుకొస్తుందని, తమకు న్యాయం జరుగుతుందని కౌలురైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్నే కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో కౌలురైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

**ప్రత్యేక ఉత్తర్వులిస్తేనే కౌలురైతులకు న్యాయం..?**

ఆరుగాలం శ్రమించి వ్యవసాయ సాగు చేస్తున్న కౌలురైతులకు న్యాయం జరగాలంటే కూటమి ప్రభుత్వం వెంటనే అందుకు సంబంధించిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. 2019లో వైసిపి ప్రభుత్వం కౌలుచట్టంలో మార్పులు చేస్తూ భూయజమాని అంగీకారంతోనే కౌలుకార్డులు జారీ అంటూ నిబంధన విధించింది. దీంతో గ్రామాల్లో భూయజమానులు మరింత రెచ్చిపోతున్నారు. చట్టంలో ఆ నిబంధన తొలగిస్తున్నట్లు ప్రభుత్వం వెంటనే ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేయాలి. ఆ తర్వాత చట్టంలో మార్పులు చేయాలి. అప్పుడే కౌలురైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీచేస్తే క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు ఇ-పంటలో కౌలురైతులు పేర్లు నమోదు చేస్తారు. అలాకాకుండా కౌలురైతుల పేర్లు నమోదు చేయాలంటూ ఎన్నిమాటలు చెప్పినా క్షేత్రస్థాయిలో భూయజమానులు అందుకు అంగీకరించే పరిస్థితి లేదు. ప్రభుత్వం వెంటనే తగిన ఉత్తర్వులు జారీచేసి ప్రస్తుత ఖరీఫ్‌లో కౌలురైతులకు బీమా అవకాశం ఇవ్వాలని అంతా కోరుతున్నారు. ఇప్పటికే వరదలు, భారీ వర్షాలకు రెండు జిల్లాల్లో 32 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిని కౌలురైతులు తీవ్రంగా నష్టపోయారు. ముందుముందు ఏదైనా నష్టం వాటిల్లినా బీమా నమోదు చేస్తే కౌలురైతులకు అండగా ఉంటుంది.





మామిడిపూడిలో పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

## ఆక్వా సాగుకు డ్రెయినేజీ వ్యవస్థ కీలకం

**కలెక్టర్ సి.నాగరాణి**

**ప్రజాశక్తి - కాళ్ల**

ఆక్వా సాగుకు డ్రెయినేజీ వ్యవస్థ ఎంతో కీలకమని, పూడుకుపోయిన డ్రెయిన్లను ప్రక్షాళన చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మండలంలోని ప్రాతళ్లమెరక, కలవపూడి గ్రామాల్లో ఆదివారం ఆమె ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజుతో కలిసి పర్యటించారు. ప్రాతళ్లమెరక గ్రామంలో మంచినీటి చెరువును పరిశీలించారు. చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేసి మొక్కలు నాటడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి, అక్కడ అందిస్తున్న ఆరోగ్య సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కలవపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో కలెక్టర్, ఎంఎల్ఎ మొక్కలు నాటి, నీరు పోశారు. అనంతరం కలవపూడి గ్రామంలో మామిడిపూడి రోడ్డు వద్ద మురుగుకాలువలో పూడికతీత పనులను కలెక్టర్ నాగరాణి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రెయినేజీ వ్యవస్థ ఎంతో ముఖ్యమైందని, సక్రమంగా నీటి పారుదల అయినప్పుడే వ్యాధుల నుండి రక్షణ పొందగలమన్నారు. రొయ్యల పట్టుబడి అనంతరం చెరువుల్లోని కలుషిత నీరు మురుగు కాలువల్లోకి వెళ్లాలన్నారు. అలాకాకుండా ప్రస్తుతం ఆ నీరు పంట కాలువల్లోకి వెళ్లడంతో ప్రజలు రోగాల పాలవుతున్నారన్నారు. ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు రైతుల భాగస్వామ్యంతో మురుగు కాలువలను శుభ్రపర్చేందుకు సంకల్పించడం, దీనికి రైతులు సహకరించడం అభినందనీయన్నారు. కలవపూడిలో మంతెన పెద్ద నరసింహరాజు, మిగిలిన రైతులంతా కలిసి సుమారు రూ.13 లక్షలు విలువైన పనులను ప్రారంభించారన్నారు. ప్రారంభించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ డ్రెయినేజీల్లోని గుర్రపుడెక్క, ఇతర చెత్తను తొలగింపు ఇప్పటికే నియోజకవర్గంలో చాలావరకు పూర్తయ్యిందన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యవస్తంగా తయారైనదన్నారు. ప్రభుత్వం, రైతుల సహకారంతో ఉండి నియోజకవర్గంలోని డ్రెయిన్లు, కాలువలను రెండు, మూడు నెలల్లో పూర్తిగా ప్రక్షాళన చేస్తామన్నారు. అనంతరం పెదఅమిరం గ్రామంలో ఇ-పంట నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు (కలవపూడి రాంబాబు), మంతెన పెద నరసింహరాజు, గ్రామ సర్పంచి గేదల జాన్, ప్రాతళ్లమెరక సర్పంచి కంతేటి ఉష శ్రీనివాసరాజు, ఎంపిడిఒ జి.స్వాతి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ నాగార్జున, ఆకివీడు సిఐ జగదీశ్వరరావు, కాళ్ల ఎస్ఐ శ్రీనివాసరావు, వేగిరాజు శివవర్మ, ఉప సర్పంచి కంతేటి చంద్రావతి, సుబ్బరాజు, మంతెన శివాజీరాజు, గోకరాజు శివబాబు, గోకరాజు కిషోర్‌రాజు పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదా కోసం కృషి చేయాలి

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం**


**ప్రజాశక్తి - పాలకొల్లు**

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం కోరారు. ఆదివారం స్థానిక మహిళా సంఘ భవనంలో కౌరు పెద్దిరాజు అధ్యక్షతన సిపిఎం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథి సీతారాం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం మీద ఆధారపడి నడుస్తోందని, ప్రత్యేక హోదా సాధించుకోవడానికి ఇదే సరైన సమయమని అన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటుపరం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్రానిదేనని, అందుకే కేంద్రంతో పోరాడి ప్రయివేటుపరం కాకుండా చూడాలని సీతారాం కోరారు.



మాట్లాడుతున్న మంతెన సీతారాం

జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ రాష్ట్రంలో ధాన్యం బకాయిలు పేరుకుపోయాయని, వెంటనే రైతులకు చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఖరీఫ్ సాగుకు పెట్టుబడుల నిమిత్తం ఆదుకునేందుకు బకాయిల చెల్లింపు చేపట్టాలన్నారు. జిల్లాలో రోడ్ల మరమ్మతులు తక్షణం చేపట్టాలని బలరాం కోరారు. దళితుల శ్మశాన వాటికల సమస్యలు పరిష్కరించాలని, వర్షాకాలంలో దళితులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో సిపిఎం నేతలు పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, కేతా గోపాలన్, జెఎన్‌వి.గోపాలన్, చింతకాయల బాబూరావు, జె.శ్రీనివాస్, జుత్తిగ నరసింహమూర్తి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.




సైనికులను సత్కరిస్తున్న మంత్రి, ప్రముఖులు

## సైనిక కార్పొరేషన్ అంశం సిఎం దృష్టికి తీసుకెళ్తా

**హోం శాఖా మంత్రి అనిత**

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

సైనికుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోం శాఖామంత్రి వంగలపూడి అనిత తెలిపారు. స్థానిక ఎపి నిట్ ఆవరణలో కార్గిల్ విజయ్ దివాస్ రజతోత్సవ వేడుక ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి అనిత మాట్లాడుతూ సైనికులు 30 నుంచి 35 ఏళ్ల మధ్య రిటైర్ అవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రస్తుతం ఉన్న రెండు శాతం రిజర్వేషన్లను పెంచడానికి కేబినెట్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. టిబిఆర్ విద్యాసంస్థల్లో విద్యార్థుల క్రమశిక్షణ చూస్తే గర్వంగా ఉందన్నారు. తాడేపల్లిగూడెం మండలంలోని మిలటరీ మాధవరం గ్రామానికి తాను ఒకసారి వస్తానన్నారు. పోలీసులను, జవాన్లను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సైనికుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్‌వర్మ అన్నారు. తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలంతా సుఖంగా ఉన్నారంటే దానికి కారణం సైన్యం అని అన్నారు. సైనిక స్కూల్ ద్వారా రాష్ట్రంలో ఒక వినూత్న ప్రయోగం చేసిన టిబిఆర్ విద్యా సంస్థల అధినేత భోగేశ్వరరావును అభినందించారు. సెంట్రల్ గవర్నమెంట్ స్టాల్స్, క్యాంటీన్ పెట్టాలని మాజీ సైనికులు కోరుతున్నారని, ఈ విషయాన్ని సిఎం దృష్టిలో పెట్టినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ విషయంలో మంత్రి అనిత చొరవ తీసుకోవాలని కోరారు. కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భోగేశ్వరరావును అభినందించారు. ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు మాట్లాడుతూ దేశంలో మనకు స్వేచ్ఛగా ఉన్నామంటే అది సైనికుల త్యాగ ఫలితమేనన్నారు. సైనికులను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. అనంతరం పరమవీరచక్ర సంజయ్ కుమార్, చారులత తదితరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సోము వీర్రాజు, చౌదరి, నార్ని తాతాజీ, ఈతకోట తాతాజీ, టిడిపి ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, నాయకులు పాల్గొన్నారు.

# 15 నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

**సెప్టెంబర్ 30 వరకు కొనసాగింపు - ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేసి పరిష్కారం చూపుతాం - కలెక్టర్ నాగరాణి**

**ప్రజాశక్తి - భీమవరం**



జిల్లాలో ఈ నెల 15న గ్రామ రెవెన్యూ సదస్సులు లాంఛనంగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. 16 నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు 45 రోజులపాటు సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 45 రోజులపాటు ఈ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజల నుంచి ఐదు కేటగిరీల్లో పిటీషన్లు స్వీకరించి ఐదు రిజిస్టర్లలో నమోదు చేయాలని పేర్కొన్నారు. మ్యుటేషన్, కౌలు రైతు కార్డులు (ఎల్ఇసి), భూమి వివాదాలు, భూఆక్రమణ, నిషేధ జాబితా 22(ఎ) పిటీషన్లు స్వీకరిస్తారని తెలిపారు. వీటిని ఆన్‌లైన్‌లో పొందుపరిచి, ఆర్‌టిజిఎస్ విభాగం పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఫిర్యాదు ఇచ్చిన ప్రజలకు వెంటనే రశీదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వీటన్నింటికీ పరిష్కారం చూపేందుకు ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ సదస్సులు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో తహశీల్దార్, ఆర్ఐ, విఆర్ఒ, మండల సర్వేయర్, దేవాదాయ, వక్ఫ్ శాఖల ప్రతినిధులు, రిజిస్ట్రేషన్, అటవీ శాఖాధికారులు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి సమస్యపైనా విచారించి ఏం చర్యలు తీసుకున్నామో ఫిర్యాదుదారులకు తెలియజేస్తామని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటలకే రెవెన్యూ సదస్సులు ప్రారంభమవుతాయని, ఏ గ్రామంలో ఎప్పుడు సదస్సులు నిర్వహిస్తారో ముందస్తుగా తెలియజేస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు జిల్లా జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో జిల్లా మంత్రులు, ఎంపీ, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, జెడ్‌పి ఛైర్మన్, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొనేలా సంబంధిత అధికారులు వారికి ముందస్తుగా సమాచారం అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని 20 మండలాల్లో 318 గ్రామాలు ఉన్నాయని, వాటిలో భీమవరం డివిజన్లో ఏడు మండలాల్లో 117 గ్రామాలు, నరసాపురం డివిజన్లో ఎనిమిది మండలాల్లో 111 గ్రామాలు, తాడేపల్లిగూడెం డివిజన్లో ఐదు మండలాల్లో 90 గ్రామాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.



విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నేతలు, కార్యకర్తలు

## వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ

**ప్రజాశక్తి - తణుకు**

కేరళలోని వయనాడ్ వరద బాధితులను ప్రతిఒక్కరూ ఆదుకోవాలని సిపిఎం వేల్పూరు గ్రామ కమిటీ కోరింది. ఆదివారం వేల్పూరులో సర్వస్వం కోల్పోయి దిక్కుతోచక విలవిల్లాడుతున్న వరద బాధితులను ఆదుకోవడానికి సిపిఎం ఆధ్వర్యంలో వేల్పూరు బస్టాండ్ సెంటర్ నుండి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు షాప్ టు షాప్ తిరుగుతూ ప్రజల నుండి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం గ్రామ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు మాట్లాడారు. విరాళాలు అందించి సహకరించిన గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు, నేతలు సోరపల్లి రామకృష్ణ, విశ్వనాథం సుబ్బారావు, అంబటి రామకృష్ణ, యండమూరి నాగేంద్ర, వాసా పోసియ్య, తాళ్ల సత్యనారాయణ, అల్లం శ్యామ్, కరెళ్ల అర్జున్, బొక్కా మోహన్‌రావు పాల్గొన్నారు.

## నేటి నుంచి కెవిపిఎస్ రాష్ట్రస్థాయి తరగతులు

**ప్రజాశక్తి - భీమవరం**

కెవిపిఎస్ రాష్ట్రస్థాయి చైతన్య శిక్షణా తరగతులు సోమవారం నుంచి నుంచి మూడు రోజులపాటు భీమవరంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దళితులు, వెనకబడిన తరగతుల ప్రజల అభివృద్ధికి కెవిపిఎస్ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కులవివక్ష వ్యతిరేకంగా పోరాడుతూ దళితపేటల అభివృద్ధికే కృషి చేస్తుందని తెలిపారు. సంఘం చైతన్య శిక్షణా తరగతులు ఈ నెల 12, 13, 14 తేదీల్లో భీమవరంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజుల్లో ముఖ్యఅతిథులుగా శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, కలెక్టర్ సి.నాగరాణి, ఎంఎల్‌సిలు ఐ.వెంకటేశ్వరరావు, కెఎస్.లక్ష్మణరావు, జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి కె.శోభారాణి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి దశలవారీగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి సుమారు 200 మంది కార్యకర్తలు హాజరవ్వనున్నట్లు తెలిపారు.

## టోల్‌ట్యాక్స్ ప్రతిపాదన తగదు

**సిపిఎం ఆధ్వర్యాన నిరసన**

**ప్రజాశక్తి - పాలకోడేరు**

రాష్ట్ర రహదారులపై టోల్‌ఛార్జీల వసూలు ప్రతిపాదనను విరమించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య డిమాండ్ చేశారు. టోల్ ఛార్జీల ప్రతిపాదనను విరమించుకోవాలని కోరుతూ ఆదివారం శృంగవృక్షం సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అశ్రియ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపే ఆలోచన విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.





నిరసన తెలుపుతున్న సిపిఎం శ్రేణులు

## జగన్ పాలనలో అభివృద్ధి గాలికి

**జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు**

**ప్రజాశక్తి - యలమంచిలి**

జగన్ ఐదేళ్ల పాలనలో విధ్వంసం పోలవరం, అమరావతిలోనే కాదని నక్కల అవుట్ ఫాల్స్ స్లూయిస్‌లోనూ కనిపిస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని లక్ష్మీపాలెం నక్కల డ్రెయిన్ అవుట్ ఫాల్స్ స్లూయిస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో డ్రెయిన్లు, కాలువలపై లాకులు, తలుపుల మరమ్మతు పనులే కాకుండా కనీసం గ్రీజ్ నిర్వహణ కూడా పట్టించుకోకుండా గాలికొదిలేశారని తెలిపారు. అందువల్లే నీటి ప్రవాహానికి గేట్లు కొట్టుకుపోవడం, తుప్పుపట్టిన రోప్‌లు తెగిపోవడం వంటివి జరుగుతున్నాయన్నారు. ఇటీవల వరద ఉధృతికి నక్కల కాలువ అవుట్ ఫాల్స్ స్లూయిస్ వద్ద తలుపు కొట్టుకుపోయిందని, ఈ పరిస్థితుల్లో మరో తలుపు తెచ్చి అమర్చామని తెలిపారు. కొత్త తలుపు ఏర్పాటు కోసం అత్యవసర పనిగా రూ.50 లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. జగన్ ఐదేళ్ల మొద్దు నిద్ర చేసిన పాపం ప్రజలు అనుభవిస్తున్నారని తెలిపారు.




స్లూయిస్‌ను పరిశీలిస్తున్న మంత్రి

## యోధుడు ప్రకాశం పంతులు

**ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ**

**ప్రజాశక్తి - తణుకు**

స్వాతంత్ర సమరంలో ప్రముఖ పాత్ర పోషించిన యోధుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక బాలగంగాధర్ తిలక్ ఆడిటోరియం హాలులో జైఆంధ్ర (జై భారత్) సమాచార హక్కు సంఘం ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జీవిత చరిత్రపై జాతీయ స్థాయి సమావేశం, అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ ఒక నిరుపేద కుటుంబంలో పుట్టి ఉన్నత చదువులు చదివి రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి అయిన ధీరోదాత్తుడు మన టంగుటూరి ప్రకాశం పంతులు అని కొనియాడారు. మద్రాస్ సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకీ గుండుకు ఎదురుగా గుండెను నిలిపి బ్రిటీష్ వారిని ఎదుర్కొన్న ధీశాలి ప్రకాశం పంతులు అన్నారు. ఆయన చూపిన ధైర్య సాహసాలు, చూపిన మార్గం అందరికీ సదా ఆచరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో తామరాపు సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ

## నరసాపురం రూరల్ సిఐగా దుర్గాప్రసాద్ బాధ్యతలు

**ప్రజాశక్తి - నరసాపురం**

నరసాపురం రూరల్ సిఐగా జి.దుర్గాప్రసాద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన 2002లో ఎస్ఐగా ఎంపికయ్యారు. 2013లో సిఐగా ప్రమోషన్ రాగా కుక్కునూరు, విజయవాడ సిఐడి, విజయవాడ ట్రాఫిక్ సిఐగా పనిచేశారు. తాజాగా విజయవాడ ట్రాఫిక్ నుంచి నరసాపురం రూరల్ సిఐగా బదిలీ అయ్యారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన సిఐ గోవిందరాజు విఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఐను కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.




సిఐ దుర్గాప్రసాద్

## జోగిరెడ్డి మృతి తీరనిలోటు

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

వైసిపి మార్టేరు గ్రామ సీనియర్ నాయకుడు, పంచాయతీ 4వ వార్డు సభ్యులు కర్రి జోగిరెడ్డి ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటు అని మాజీ మంత్రి, ఎంఎల్‌సి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం ఆయన జోగిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కేన్సర్ బాధితునికి ఆర్థిక సహాయం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

## కేన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

మావుళ్ళమ్మ రజక సంఘం కార్యవర్గ సమావేశం భీమవరం పట్టణంలోని 37వ రజకపేట కమ్యూనిటీ హాల్లో ఆదివారం సంఘం అధ్యక్షుడు కంబాల వెంకట జగదీష్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం అనంతరం కేన్సర్‌తో బాధపడుతున్న పాలెం తాతారావుకు రజక సంఘం నాయకుడు జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి ఉప్పులూరి చంద్రశేఖర్ మావుళ్ళమ్మ రజక సంఘం తరపున రూ.8 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు చించినాడ శ్రీనివాస్, సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కంబాల వెంకట జగదీష్, తలుపూరి కృష్ణ, ఉపాధ్యక్షుడు తలుపుల బాలాజీ పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయాలు నెరవేర్చాలి : ఎంఎల్‌ఎ

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

గాంధీజీ ఆశయాలు నెరవేరినప్పుడే నిజమైన స్వాతంత్ర్యమని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. ఆదివారం శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉండి ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో గాంధీజీ ఆశయాల బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజును సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఉద్యమాల వెనుక ఎందరో దేశ భక్తుల దేశ వ్యాప్తంగా నడిచారన్నారు. గాంధీజీ కలలు గన్న స్వరాజ్యాన్ని తీసుకురావాలని, వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ గాంధీజీ చెప్పిన గ్రామ స్వరాజ్య నినాదాన్ని నిజం చేయాలన్నారు. కార్యక్రమంలో పొత్తూరి వెంకటేశ్వరరావు, కొత్తపల్లి నాగరాజు, అరుణోదయ మనో వికాస కేంద్రం డైరెక్టర్ సిహెచ్ అరుణాదేవి పాల్గొన్నారు.

## సోమేశ్వరస్వామి నిత్యాన్నదానికి రూ.49.82 లక్షలు

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

భగవంతునికి ఎంతో భక్తితో యాత్రికులు సమర్పించిన విరాళం భగవంతుని చెంతకే చేరాలని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. సోమేశ్వర జనార్దన స్వామివార్ల నిత్యాన్నదాన ట్రస్టుకు అన్నపూర్ణ పార్వతి సమేత శ్రీసోమేశ్వర లక్ష్మీ జనార్దన స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.49,82,825 చెక్కును ఎంఎల్‌ఎ అంజిబాబు చేతుల మీదుగా దేవస్థానానికి అందజేశారు. ఎంఎల్‌ఎ అంజిబాబు మాట్లాడుతూ యాత్రికులకు స్వామి వారి ప్రసాదాన్ని అందించాలనే సంకల్పంతో అప్పటి ఆలయ ఛైర్మన్ వేగేశ్న రంగరాజు దాతల నుంచి సేకరించి నిత్యాన్నదానాన్ని ప్రారంభించారని, ట్రస్ట్ బోర్డు ముగియడంతో అప్పటి నుంచి సేకరించిన నిధులను ఇప్పుడు నిత్యాన్నదానానికి అందజేశారని తెలిపారు. ఇక నుంచి దాతలు అందించిన నిధులతో అన్నదానం చేస్తారన్నారు. ఆలయంలో నిత్యాన్నదానం ఏర్పాటు చేయడానికి సదుపాయం లేదని, త్వరలోనే దాతల సహకారంతో షెడ్ కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. అన్నదానానికి నిధులు సేకరించిన రంగరాజును సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ డి.రామకృష్ణంరాజు, ఆలయ ప్రధానార్చకులు కందుకూరి సోంబాబు, చెరుకూరి రామకృష్ణ, జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

## రంగరాజుకు డాక్టరేట్ అభినందనీయం

**ఉండి:** నాటక రంగంపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించడం అభినందనీయమని కెజిఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ దాయన చంద్రాజీ అన్నారు. ఉండిలోని ముదునూరి గోపాలరాజు నివాసంలో జరిగిన సమావేశం ఐక్య ఫౌండేషన్ సంస్థ అధ్యక్షులు ముదునూరి శివరామరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి చంద్రాజీ మాట్లాడుతూ జిల్లా నాటకరంగం తొలి పరిశోధన కావటం విశేషం అన్నారు. ఎస్‌విఇ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ ఇందుకూరి గజపతిరాజు మాట్లాడుతూ రంగరాజు మాస్టారు చేసిన పరిశోధన అభినందనీయమన్నారు. కవిగా రచయితగా, ఉపాధ్యాయునిగా, నటునిగా కార్యనిస్సగా ఇలా బహుముఖ ప్రజ్ఞాశీలి అయిన రంగరాజు మాస్టారు డాక్టరేట్‌కు అర్హుడని అన్నారు. అనంతరం రంగరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు ఆదారి, సంస్థ నాయకులు ముదునూరి గోపాలరాజు, మానాపత్రుల రామకృష్ణారావు, ఆనంద్, నాయుడు, బాలాజీ పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ ఆలయం కిటకిట

**మొగల్తూరు:** ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో పాలకవర్గ సభ్యులు ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ చేశారు. అమ్మవారిని మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవ నాయుడు, టిడిపి నర్సాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, బదిలీ అయిన రూరల్ సిఐ గోవిందరాజు దంపతులు, నరసాపురం రూరల్ సిఐగా బాధ్యతలు చేపట్టిన దుర్గాప్రసాద్ దర్శించుకున్నారు.

## నేడు మృత్యుంజయుడు, బసవ మల్లయ్య వర్ధంతి సభ

**ఆచంట:** పీడిత ప్రజల హక్కులకై పోరాడి, వారి ఆశయాలను ఆచరణలో నిరూపించిన అమరవీరులు ప్రేరేప మృత్యుంజయుడు, తాళ్ల బసవ మల్లయ్య ప్రజల హృదయాల్లో స్థిరస్థాయిగా నిలిచిపోతారని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ అన్నారు. ప్రేరేప మృత్యుంజయుడు, తాళ్ల బసవ మల్లయ్య వర్ధంతి సభ సోమవారం ఆచంట కవేరీ సెంటర్లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ముందుగా ఉదయం 9 గంటల నుంచి ఆచంట వేమవరం, పెనుమంచిలి, వయా ఆచంట వరకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం కవేరీ సెంటర్లో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఆచంట మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## 13న సభ జయప్రదం చేయాలి

**మొగల్తూరు:** ఎస్‌సి వర్గీకరణ అనుకూలంగా భారతదేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన చరిత్రాత్మకమైన తీర్పు న్యాయాన్ని బతికించిందని ఎంఆర్‌పిఎస్ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కారుమంచి అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ హైదరాబాద్‌లో జరగనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి న్యాయం జరిగిందని తెలిపారు. స్వార్థపరులు వర్గీకరణ వ్యతిరేకించినప్పటికి ఎస్‌సి ఉపకులాల్లో అసమానతలు గుర్తించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి వై చంద్ర సూడ్ ఆధ్వర్యంలో ఏడుగురు ప్రధాన న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం అనుకూల తీర్పునివ్వడం మాదిగ, ఉప కులాలకు చాలా సంతోషకరం అని తెలిపారు.



# శిథిలావస్థలో ఏలూరుపాడు లాకులు..!

## పట్టించుకోని పాలకులు, అధికారులు

**ప్రజాశక్తి - కాళ్ల**

నాటి వైభవం నేడు కనుమరుగైంది.. ఘన చరిత్ర కలిగిన ఏలూరుపాడు లాకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని 1868లో కాటన్ నిర్మించారు. ఈ కట్టడాల నిర్వహణపై దశాబ్దాలుగా నిర్లక్ష్యం కొనసాగుతోంది. గత టిడిపి, వైసిపి ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోకపోవడంతో క్షేత్ర స్థాయిలో ఆయా కట్టడాల పరిస్థితి ప్రమాదకరంగా మారింది. మరలా అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం రైతుల, ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఏలూరుపాడు లాకులను అభివృద్ధి చేస్తారని పలు గ్రామాల రైతులు, ప్రజలు కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. డెల్టాలో పరిమెళ్ల లాకులు నుంచి ప్రారంభమైన వెంకయ్య వయ్యేరు పంట కాలువ ఏలూరుపాడు లాకులు వద్ద ముగుస్తోంది. ఏలూరుపాడు లాకులు నుంచి ఉప్పుటేరులో కలుస్తోంది. ఒకప్పుడు లాకుల మార్గం నుంచి జల రవాణా జరిగేది. మచిలీపట్నం వెళ్లేందుకు ఈ మార్గాన్నే ఉపయోగించేవారు.



శిథిలావస్థకు చేరిన ఏలూరుపాడు లాకులు

**1868 నుంచి సేవలు..**

ఏలూరుపాడు లాకులు 1868లో బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో సర్ ఆర్థర్ కాటన్ నిర్మించారు. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరింది. పెంటపాడు, నిడమర్రు, గణపవరం, ఆకివీడు, కాళ్ల మండలాలకు సాగు, తాగు నీరందిస్తోంది. 40 వేల ఎకరాల ఆయుకట్టుకు వెంకయ్య వయ్యేరు నీరు ప్రధాన ఆధారం. 50 గ్రామాల ప్రజలకు తాగునీటిని అందిస్తోంది. నీరు అవసరం ఉన్నప్పుడు లాకును కట్టి కాల్వలకు మళ్లించి పంటలు పండిస్తున్నారు. ఈ కాలువకు దిగువలో ఏలూరుపాడు లాకులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. వరి, ఆక్వా పంటలు పండిస్తున్నారు. ఇంత చరిత్ర ఉన్న లాకులు నేడు శిథిలావస్థకు చేరినా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి లాకులుకు మరమ్మతులు చేపట్టాలని పలు గ్రామాల రైతులు, ప్రజలు కోరుతున్నారు.

**లాకుల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశాం..**
**ఫణి శంకర్, ఇరిగేషన్ ఎఇ, ఆకివీడు**

ఏలూరుపాడు లాకులకు మరమ్మతులు చేసేందుకు సుమారు రూ.20 లక్షల ప్రతిపాదనలు పంపాం. ఏలూరుపాడు లాకుల నీరు వృథాగా పోకుండా బరకంతో అడ్డుకట్ట వేశాం.

# నాగేశ్వరరావు జీవితం స్ఫూర్తిదాయకం

## జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

**ప్రజాశక్తి - పాలకొల్లు**

చేనేత వర్గాల ముద్దుబిడ్డ, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవ పోరాటయోధుడు జాన నాగేశ్వరరావు జీవితం యువతకు భావితరాలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం లాకుల సెంటర్లో ఏర్పాటు చేసిన జాన నాగేశ్వరరావు కాంస్య విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ నేత కార్మికుడే కాకుండా బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి నాగేశ్వరరావు అన్నారు. అంబేద్కర్ సమసమాజ స్థాపనకు పోరాడిన మహనీయుడి స్ఫూర్తిగా తాను రాజకీయాలకు వచ్చానని తెలిపారు. పాలకొల్లులో పుట్టి పాలకొల్లు నుండి బడుగు బలహీన వర్గాల గళం దేశానికి వినిపించిన నాయకుల్లో జానా నాగేశ్వరరావు ఒకరిని తెలిపారు. పాలకొల్లులో ఆయన విగ్రహం ఉండాలని చేనేత వర్గాలు, కుటుంబ సభ్యులు కోరిన నేపథ్యంలో పాలకొల్లు నడిబొడ్డున విగ్రహం ఏర్పాటు చేసుకుని, అందరి సమక్షంలో విగ్రహావిష్కరణ చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. చేనేత వస్త్రాలకు పూర్వ వైభవం తీసుకురావాలని చేనేత దినోత్సవం రోజు సిఎం చంద్రబాబు స్వయంగా తన భార్యకు చేనేత చీరలు కొన్నారన్నారు. చేతివృతిదారులు 50 సంవత్సరాలకే కంటి చూపు, నరాల్లో సత్తువ తగ్గిపోయి కుటుంబ జీవన విధానంలో బాధలు పడకూడదని, భవిష్యత్తులో 50 ఏళ్లకే పెన్షన్ ఇచ్చే కార్యక్రమం అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, నాయకులు వట్టం గణేశ్వరరావు, పెచ్చేట్టి బాబు, కర్నేని గౌరునాయుడు, కర్నేని రోజారమణి, ఉన్నమట్ల కబర్థి, చింతపల్లి గురు ప్రసాద్ పాల్గొన్నారు.



జానా నాగేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు


## 300 మందికి వైద్య పరీక్షలు



మెడికల్ క్యాంప్ లో పాల్గొన్న వైద్య సిబ్బంది క్లబ్ మెంబర్స్

**ప్రజాశక్తి - యలమంచిలి**

యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ పాలకొల్లు వారి ఆధ్వర్యంలో మండలంలోని దొడ్డిపట్ల గ్రామం జెడ్‌పి హైస్కూల్ వద్ద ఆదివారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో కిడ్నీ, మూత్ర సంబంధిత డాక్టర్ యాతం శ్రీరంగ, చర్మ వ్యాధి డాక్టర్ జక్కంపూడి సుభాషిని, దంత వైద్య నిపుణులు కావలి మౌని, కిమ్స్ అమలాపురం ఆసుపత్రి నుంచి గుండె సంబంధిత డాక్టర్ కౌశికి, నేత్ర వైద్యులు సేవలు అందించారు. సుమారు 300 మందికి ప్రజలకు వైద్య సేవలందించి, ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ ముచ్చర్ల సంజయ్, గవర్నర్ పెనుమాక రామ్మోహన్, అధ్యక్షులు జక్కంపూడి మాధవ్, కార్యదర్శి వేరుకొండ దుర్గాప్రసాద్, కోశాధికారి సిరిగినీడి నాగార్జున, కానూరు ప్రభాకర రావు, బోనం నాని, చేగొండి రవిశంకర్, మద్దాల రాంప్రసాద్, గంధం ఏసుపాదం, శిరిగినీటి రాంబాబు, గుండుమోగుల వీరాస్వామి, రావూరి అప్పారావు, కామిశెట్టి సాయిబాబు, కుంపట్ల రాజా, వీరాజీ పాల్గొన్నారు.



సూర్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

## పితానికి బిసి నేతల పరామర్శ

**ప్రజాశక్తి - పాలకోడేరు**

ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణను పాలకోడేరు మండల బిసి నేతలు కామన రాంబాబు, చేబోలు రామకృష్ణ ఆదివారం పరామర్శించారు. ఎంఎల్‌ఎ పితాని సోదరుడు సూర్యనారాయణ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ఈ నేపథ్యంలో బిసి నేతలు సూర్యనారాయణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పితాని కుటుంబానికి సానుభూతి తెలిపారు.



పార్కును పరిశీలిస్తున్న సిఐ యాదగిరి

## మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు : సిఐ

**ప్రజాశక్తి - నరసాపురం**

పార్క్‌కు వచ్చే మహిళలు, యువతుల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ బి.యాదగిరి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని కాటన్ పార్క్‌ను సిఐ పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎవరైనా వేధింపులు గురిచేసినా, అసభ్యంగా ప్రవర్తించినా 100, 112 డయల్ చేయాలన్నారు.

## ఆసుపత్రికి ఫ్యాన్లు అందజేత

**ప్రజాశక్తి - తణుకు**

ఆసుపత్రిలోని రోగుల సేవార్థం మల్లిన అరుణసారధి రూ.30 వేల విలువైన 15 సీలింగ్ ఫ్యాన్లు అందజేయడం అభినందనీయమని తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ వెలగల అరుణ కొనియాడారు. ఆదివారం స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఆవరణలో ఆనందం మస్తాన్‌రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించి, రోటరీ క్లబ్ ద్వారా మల్లిన అరుణసారధి ఆర్థిక సౌజన్యంతో 15 సీలింగ్ ఫ్యాన్లు ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ అరుణ రోటరీ కార్యక్రమాలను అభినందించారు. అనంతరం అరుణసారధి తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లోని పెద్దలకు ఆసరాగా రూ.5 వేల విరాళం అందజేశారు. రోటరీ క్లబ్ ఆవరణలో జరిగిన సమావేశంలో వేల్పూరుకు చెందిన ప్రతిభా విద్యార్థిని సిహెచ్ శ్రుతికి ఆర్థిక సాయంగా రూ.8 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె.సిద్ధార్థ, అక్కిన కాశీ విశ్వనాథం, కలగర వెంకటకృష్ణ, డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, కె.సత్యనారాయణరాజు, డాక్టర్ వెంకటరాజు, డాక్టర్ ఎస్‌వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## నేడు మంత్రి మనోహర్ రాక

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ఏలూరు రానున్నారు. ఆయన ఉదయం తొమ్మిది గంటలకు తెనాలి నుండి కారులో బయల్దేరి 11 గంటలకు ఏలూరు చేరుకుంటారు. ఏలూరు సిఆర్‌రెడ్డి కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అందించిన రైతులకు సొమ్మును సంబంధిత రైతులకు చెక్కుల ద్వారా పంపిణీ చేస్తారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు ఏలూరు నుండి అమలాపురం బయల్దేరి వెళ్తారు.

## పిఎంపిల సేవలు అభినందనీయం

**ప్రజాశక్తి - మొగల్తూరు**

మొగల్తూరు పిఎంపి అసోసియేషన్ వైద్యులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రజలకు వైద్య సేవలందించడం అభినం దనీయమని సీతాశ్రీ హాస్పిటల్ వైద్యులు గుబ్బల జితేంద్ర చైతన్య అన్నారు. ముత్యాలపల్లి గ్రామంలో మోటుపల్లి రాజాస్ కళ్యాణ మండపంలో పిఎంపి అసోసియేషన్ 25వ వసంతోత్సవాలను ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కెఎస్‌పిఎస్ ముక్తేశ్వరరావు, సిహెచ్ విపి.శ్రీనివాస్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ పిఎంపి వైద్యులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వైద్యులు అద్దంకి శివరామకృష్ణ, అద్దంకి విజ్ఞాని మాట్లాడారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఏలూరు డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణ, షేక్ భాషా, సభ్యులు ఎస్.దుర్గాప్రసాద్, గనిశెట్టి శ్రీనివాస్, వాటాల చిట్టిబాబు, జి.శాస్త్రి, ఆనందరావు పాల్గొన్నారు.

## మొగల్తూరు ఎస్‌ఐగా వాసు

**ప్రజాశక్తి - మొగల్తూరు**

మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కషి చేస్తానని ఎస్‌ఐ జి.వాసు అన్నారు. కృష్ణా జిల్లా బంటుమిల్లి ఎస్‌ఐగా పనిచేసి వాసు బదిలీపై మొగల్తూరు వచ్చారు. ఆదివారం మొగల్తూరు ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. దొంగతనాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న కె.వెంకటరమణ ఆచంట ఎస్‌ఐగా బదిలీ అయ్యారు.



బాధ్యతలు చేపడుతున్న ఎస్‌ఐ వాసు

## కారు, గేదె ఢీ

**ప్రజాశక్తి - యలమంచిలి**

మండలంలోని చించినాడ జాతీయ రహదారి వద్ద ఆదివారం ఉదయం పాడి గేదె రోడ్డుపైకి అకస్మాత్తుగా రావడంతో అటుగా వెళ్తున్న కారుకు బలంగా తగలడంతో కారు దెబ్బతింది. వివరాల్లోకి వెళితే రాజోలు వైపు నుంచి పాలకొల్లు వైపు వెళ్తున్న కారు చించినాడ వద్దకు వచ్చేసరికి అదే సమయంలో రహదారిని దాటేందుకు వస్తున్న గేదె కారును ఢీకొట్టింది. దీంతో కారు దెబ్బతింది. గేదెకు కూడా బలమైన గాయాలయ్యాయి. కారు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో డ్రైవర్‌తో పాటు కారులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రమాదం నుండి బయటపడ్డారు.

## రజకుల సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాశక్తి - గణపవరం**

రజకుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఉంగుటూరు శాసనసభ్యులు ధర్మరాజు అన్నారు ఆదివారం గణపవరం, సరిపల్లి గ్రామాల రజక సంఘం ఆధ్వర్యంలో సరిపల్లి వెంకటేశ్వర రజక కళ్యాణ మండపంలో జరిగిన ధర్మరాజు సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రజకుల సమస్యలపై దృష్టి పెడతానన్నారు గత ప్రభుత్వంతో అన్ని కుల సంఘాల ప్రజలూ మోసపోయారన్నారు. తమ ప్రభుత్వంలో రజక సంఘం వారికి అన్నివిధాలా సహకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో గణపవరం, సరిపల్లి గ్రామానికి చెందిన రజక సంఘం పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

## వృద్ధులకు వైద్య సేవలు

**ప్రజాశక్తి - తణుకు**

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్తంగా పైడిపర్రులో ఇంటికే పరిమితమై అనారోగ్యంతో బాధపడుతున్న 9 మంది వృద్ధులకు సంచారశకటం ద్వారా ఆదివారం ప్రముఖ నేత్ర వైద్యులు హుస్సేన్ అహ్మద్ ఉచిత వైద్యసేవలందజేశారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త మల్లిన అరుణసారధి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండి స్వాలీహా, అర్జి భాస్కరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సర్పంచి పల్లయ్య మృతికి సంతాపం

**ప్రజాశక్తి - మొగల్తూరు**

ముత్యాలపల్లి గ్రామ సర్పంచి కోపనాతి పల్లయ్య చిత్రపటానికి ఆదివారం నాయకులు నివాళులర్పించారు. ఆయన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయన ఇంటి వద్ద ఏర్పాటుచేసిన సంతాప సభలో పాల్గొన్న పలువురు నాయకులు పల్లయ్య చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్చార్జి పొత్తూరి రామరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బర్రె ప్రసాద్, కొల్లాటి పెంటయ్య, మల్లాస్వామి, నాగేశ్వరరావు, నాగిడి రాంబాబు, పెంద్రా శ్రీను, తిరుమాని హేమంత్ పాల్గొన్నారు.

## నేటి నుంచి సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ అంశాలపై మండలంలోని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులు శిక్షణ ఇస్తున్నట్లు మండల ప్రజా పరిషత్ అధికారి పి. పద్మజ తెలిపారు. ఈ నెల 12వ తేదీ సోమవారం నుంచి 14వ తేదీ బుధవారం వరకూ ఆయా గ్రామాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, వీధి దీపాలు, పారిశుధ్యం, తాగునీరు, గ్రామ పంచాయతీ ప్రణాళిక అభివృద్ధి (జిపిడిపి) తదితర అంశాలపై శిక్షణా కార్యక్రమం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

**ఆచంట :** ఈ నెల 12, 13, 14వ తేదీల్లో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పి.నరసింహ ప్రసాద్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ శిక్షణా తరగతుల్లో పరిపాలనపరమైన అంశాలతో పాటు, పారిశుధ్యం, తాగునీరు, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. మండల పంచాయతీ కార్యదర్శులు విధిగా పాల్గొని శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.